సాక్షి
అనంతపురం
మంగళవారం । 4 । మార్చి । 2025




చీనీ టన్ను రూ.23,200

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.23,200 పలికాయి.



టమాట కిలో రూ.8

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.8 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



న్యూస్‌రీల్

ప్రశాంతంగా సీనియర్ ఇంటర్ పరీక్షలు



అనంతపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా సోమవారం సీనియర్ ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు లాంగ్వేజ్–2 పరీక్షకు 21,952 మంది విద్యార్థులకు గాను 377 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 20,183 మందికి 19,849 మంది హాజరయ్యారు. 334 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1,769 మందికి 1,726 మంది హాజరు కాగా, 43 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ పరీక్షల నిర్వహణ కమిటీ కన్వీనర్ వెంకటరమణనాయక్ 6 కేంద్రాలు, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు 4, సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు 10, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు 16, కస్టోడియన్లు 13 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వెంకటరమణనాయక్ వెల్లడించారు.

ప్రజాభిప్రాయం లేకుండా ముందుకెళ్లొద్దు

- కలెక్టర్ వినోద్‌కుమార్‌కు శనగలగూడూరు రైతుల వినతి

పుట్లూరు: ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించకుండా బోరుబావులు తవ్వరాదని, అలా కాదని ముందుకెళ్తే కచ్చితంగా అడ్డుకుంటామని శనగలగూడూరు రైతులు తెలిపారు. ఈ మేరకు సోమవారం గ్రామానికి చెందిన రైతులు కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. రెండేళ్ల క్రితం ఓఎన్‌జీసీ అధికారులు చమురు, సహజ వాయువుల అన్వేషణ కోసం సర్వే చేపట్టారన్నారు. 2024 అక్టోబర్‌లో సి.వెంగన్నపల్లి గ్రామంలో సోలార్ లైట్లను ఏర్పాటు చేయడంతో పాటు శనగలగూడూరులో దాదాపు 10 ఎకరాల భూమిని లీజుకు తీసుకున్నారన్నారు. బోరుబావులు తవ్వితే భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో పాటు కాలుష్యం పెరిగే అవకాశం ఉందన్నారు. కనీసం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టకుండా క్షేత్ర స్థాయిలో పనులను ప్రారంభిస్తే భవిష్యత్తులో నష్టం కల్గుతుందని వాపోయారు. ఈ విషయాలపై స్పష్టత ఇవ్వకుండా పనులను చేపట్టరాదన్నారు. కార్యక్రమంలో శనగలగూడూరు రైతులు జయరామిరెడ్డి, నాగిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, గోపాల్‌రెడ్డి, అమర్, వీరారెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'టీచర్ల సీనియార్టీ'పై అభ్యంతరాల స్వీకరణ

- 10 వరకూ గడువు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపాలిటీ, నగరపాలక సంస్థ పరిధిలోని స్కూళ్లలో పని చేస్తున్న హెచ్ఎంలు, టీచర్ల సాధారణ సీనియార్టీ జాబితాను తయారు చేశారు. ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ (టిస్) ఆధారంగా రూపొందించిన జాబితాను జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్ (బ్లాగ్)లో ఉంచినట్లు డీఈఓ ఎం.ప్రసాద్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 10వ తేదీలోగా ఆధారాలతో జిల్లా సైన్స్ సెంటర్‌లో అందజేయాలని సూచించారు. టీచరు పూర్తిపేరు, ఐడీ, పదవి తదితర వివరాలు ఉండాలన్నారు. అభ్యంతరం ఎక్కడ ఉందో స్పష్టంగా పేర్కొనాలన్నారు. గడువు ముగిసిన తర్వాత వచ్చే అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోరని, కమిటీ పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు.

పాల డెయిరీలో తనిఖీలు



పాల శాంపిల్స్ సేకరిస్తున్న దృశ్యం

యాడికి: ఎలాంటి అనుమతులు లేకుండా యాడికిలో నిర్వహిస్తున్న పాల డెయిరీని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి రామచంద్ర సోమవారం తనిఖీ చేశారు. యాడికి నివాసి అమరనాథరెడ్డి గత కొన్నేళ్లుగా డెయిరీ నిర్వహిస్తూ పాలు, పెరుగు, నెయ్యి విక్రయాలతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి రామచంద్ర ఆకస్మిక తనిఖీ చేశారు. పాలు, పెరుగు, నెయ్యి నాణ్యతను పరిశీలించారు. కొన్ని శాంపిల్స్ సేకరించి ప్రయోగశాలకు పంపారు. కాగా, అమరనాథరెడ్డి నిర్వహిస్తున్న పాల డెయిరీకి లైసెన్స్ లేకపోవడంతో వెంటనే అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. డెయిరీలో ఫుడ్ సేఫ్టీ అధికారి తనిఖీలు చేపట్టారనే విషయం తెలియగానే మండల కేంద్రంలోని పలు డెయిరీలతో పాటు హోటళ్లను నిర్వాహకులు మూసి, అజ్ఞాతంలోకి వెళ్లడం గమనార్హం.

కమీషన్ల కథ..

గుడ్లు తేలేసేలా!



- కోడి గుడ్ల సరఫరా కాంట్రాక్టర్ల నుంచి టీడీపీ నేతల వసూళ్లు
- ఒక్కో నియోజకవర్గానికి నెలకు రూ.2 లక్షల సుంకం
- రవాణా కాంట్రాక్టు కూడా తమకే ఇవ్వాలని పట్టు
- కమీషన్లు ఎక్కువగా ఇవ్వాలని శ్రీ సత్యసాయి జిల్లా మంత్రి హుకుం
- 'పచ్చ' నేతల నిర్వాకంతో గుడ్డు సైజు తగ్గిందన్న విమర్శలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: 'పాలిచ్చే ఆవును పోగొట్టుకుని తన్నే దున్నపోతును తెచ్చుకున్న' చందంగా మారింది కాంట్రాక్టర్లు, ఉద్యోగుల పరిస్థితి. చివరకు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు అందించే కోడిగుడ్లను కూడా కమీషన్ ఇవ్వనిదే సరఫరా చేయడానికి వీల్లేదని 'తెలుగు' తమ్ముళ్లు తేల్చి చెప్పడంతో శ్రీ సత్యసాయి జిల్లాలో గుడ్ల సరఫరాదారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు మొదలు రేషన్ డీలర్ల వరకూ పగబట్టి తొలగించిన 'పచ్చ' నేతలు.. ఇప్పుడు కోడిగుడ్ల కాంట్రాక్టర్లనూ పీల్చి పిప్పి చేస్తుండటం గమనార్హం.

మామూళ్లివ్వకుండా సరఫరా ఎలా?

శ్రీ సత్యసాయి జిల్లాలో 32 మండలాలున్నాయి. వీటిలో 21 మండలాలకు ఒకరు, మిగతా మండలాలకు మరొకరు కోడిగుడ్లు సరఫరా చేస్తున్నారు. ఈ ఇద్దరి నుంచి ప్రతి నెలా ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు ముక్కుపిండి సుంకం వసూలు చేస్తున్నారు. ముందుగా గుడ్డుకు ఇంత ఇవ్వాలని డిమాండు చేయగా.. కాంట్రాక్టర్లు ససేమిరా అనడంతో ఒక్కో నియోజకవర్గం నుంచి నెలకు రూ.2 లక్షలు ఇవ్వాల్సిందేనని తేల్చిచెప్పినట్లు సమాచారం. ఈ క్రమంలోనే శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన ఓ మంత్రి ఇంకో అడుగు ముందుకు వేసినట్లు తెలిసింది. తాను నియోజకవర్గానికి మంత్రిని కాదని, రాష్ట్రానికి మంత్రిననీ, జిల్లాలో అన్ని నియోజకవర్గాలకు సంబంధించి మామూళ్లు ఇవ్వాలని హుకుం జారీ చేసినట్లు సమాచారం.

కదిరిలో ప్రత్యేక చట్టం..

కదిరి నియోజకవర్గంలో ప్రత్యేక చట్టం అమలవుతున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ టెండరు వేసింది కాంట్రాక్టరైతే సరఫరా చేసేది మాత్రం టీడీపీ నేతలు కావడం గమనార్హం. 'టెండరు నువ్వే వేసినా మేమే సరఫరా చేస్తాం' అంటూ తెగేసి చెప్పడంతో కాంట్రాక్టరు మిన్నకుండిపోయినట్లు తెలిసింది.

మండలానికి ఒకరు..

టీడీపీ నేతల తీరుపై కాంట్రాక్టర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్నీ వదిలెళ్లిపోతే మంచిగా ఉంటుందేమోనంటూ నిట్టూరుస్తున్నారు. గుడ్ల సరఫరా అంటే కొనుగోలు, సరఫరా రెండూ కాంట్రాక్టరువే. కానీ సరఫరా చేసే కాంట్రాక్టరును ప్రజాప్రతినిధులు బెదిరించి మండలానికి ఒకరు చొప్పున రవాణా కాంట్రాక్టును 'పచ్చ' నేతలకు ఇప్పించారు. గతంలో కాంట్రాక్టరే గుడ్లను కొనుగోలు చేసి ఆయా స్కూళ్లకు, అంగన్ వాడీ సెంటర్లకు సరఫరా చేసేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు.

సైజు చిన్నబోయింది..

ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లకు సరఫరా చేసే ఒక్కో కోడిగుడ్డు నిబంధనల ప్రకారం సగటున 52 గ్రాముల బరువు ఉండాలి. కానీ శ్రీ సత్యసాయి జిల్లాకు సరఫరా చేస్తున్న కోడిగుడ్లు ఒక్కొక్కటి 48 గ్రాముల బరువే ఉంటున్నాయని తేలింది. బరువు తక్కువున్న గుడ్డు ధర తక్కువ పడుతుందని ఇలా చేస్తున్నట్టు సమాచారం. టీడీపీ నేతలే కోడిగుడ్లు సరఫరా చేస్తున్నారు కాబట్టి కేంద్రాలకు గుడ్లు వస్తున్నాయా లేదా, సైజు ఎంత అనే ప్రశ్నించే సాహసం ఎవరూ చేయడం లేదు.

తప్పని పరిస్థితి..

గతంలో కోడిగుడ్లు బళ్లారి, హొస్పేట తదితర చోట్ల కొనుగోలు చేసి జిల్లా స్టాకు పాయింట్లకు మేమే సరఫరా చేసేవాళ్లం. ఇప్పుడు ఎమ్మెల్యేలు టీడీపీ నాయకులకు రవాణా కాంట్రాక్టు ఇవ్వాలని అడిగారు. తప్పనిసరి పరిస్థితిలో ఇచ్చాం.

–శరత్, కోడిగుడ్ల కాంట్రాక్టర్, శ్రీ సత్యసాయి జిల్లా

శ్రీ సత్యసాయి జిల్లాలో...

ప్రాథమిక పాఠశాలలు	1,527
విద్యార్థులు	41,524
ప్రాథమికోన్నత పాఠశాలలు	485
విద్యార్థులు	80,313
అంగన్‌వాడీ కేంద్రాలు	2,302
చిన్నారులు	99,142
జిల్లాలో నెలకు కోడిగుడ్ల సరఫరా	45,00,000

మహిళలు భద్రంగా ఉండే సమాజాన్ని నిర్మిద్దాం

- కలెక్టర్ వినోద్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం ఎడ్యుకేషన్: మహిళలు భద్రంగా ఉండే సమాజాన్ని నిర్మిద్దామని కలెక్టర్ వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. మహిళలు, బాలికల భద్రత, స్వీయరక్షణ సామర్థ్యాలను పెంపొందించేందుకు సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'అనంత ఆత్మరక్షణ' కార్యక్రమాన్ని సోమవారం స్థానిక శ్రీకృష్ణదేవరాయ నగరపాలక ఉన్నత పాఠశాలలో కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వీయరక్షణ ద్వారా విద్యార్థినులు, మహిళలు ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళతారన్నారు. జిల్లాలోని 495 ప్రభుత్వ యాజమాన్య ఉన్నత పాఠశాలల్లో 6–9 తరగతులు చదువుతున్న 45,640 మంది విద్యార్థినులకు ఆత్మరక్షణపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థినులకే కాకుండా మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినుల తల్లులను కూడా భాగస్వాములను చేయాలని నిర్వాహకులకు సూచించారు. వ్యాయామ ఉపాధ్యాయులతో పాటు పీటీఐలు విధిగా హాజరుకావాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే ఆత్మరక్షణ, మానసిక ధైర్యం తదితర అంశాలపై విద్యార్థినులు, యువతులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ మాట్లాడుతూ విద్యార్థుల పరీక్షల సన్నద్ధతకు ఎలాంటి అడ్డంకులు ఏర్పడకుండా సజావుగా కార్యక్రమాలను పూర్తిచేసేలా ఇన్‌స్ట్రక్టర్లతో ప్రధానోపాధ్యాయులు సహకరించి కార్యక్రమం విజయవంతం అయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటస్వామి, తహసీల్దార్ హరికుమార్, సమగ్ర శిక్ష సీఎంఓ గోపాలకృష్ణ, ఏఎంఓ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలతో పోటెత్తారు

- 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు 330 వినతులు
- పరిష్కారం చూపాలని ప్రజల వేడుకోలు



- కూడేరు మండలం కదదరకుంట గ్రామానికి చెందిన ఈమె పేరు వడ్డే లక్ష్మీదేవి (దివ్యాంగురాలు). సర్వే నంబరు 80–1లో ఉన్న 2.41 ఎకరాల భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి భూమిలో దారి కావాలంటూ మాజీ ప్రజాప్రతినిధి దౌర్జన్యంగా ముళ్ల కంచెను ధ్వంసం చేశాడు. అతనిపై కూడేరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. అయినప్పటికీ బెదిరిస్తూనే ఉండటంతో సమస్యను పరిష్కరించి, తనకు న్యాయం చేయాలని 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో కలెక్టర్‌ను లక్ష్మీదేవి వేడుకున్నారు.



- కూడేరు మండలం కలగళ్లకు చెందిన ఈ దివ్యాంగుని పేరు ఎం.చంద్రాయుడు. సదరం సర్టిఫికెట్ కోసం ఆస్పత్రిలో పరీక్ష చేయించుకుని ఆరు నెలలవుతున్నా మంజూరు కాలేదు. సర్టిఫికెట్ ఇప్పించేలా చూడాలని కలెక్టర్‌ను కోరాడు.




ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అర్జీలు పోటెత్తాయి. వివిధ సమస్యలపై మొత్తం 330 వినతులు అందాయి. కలెక్టర్ వి.వినోద్ కుమార్‌తో పాటు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్ఓ ఎ.మలోల, డిప్యూటీ కలెక్టర్లు రామకృష్ణారెడ్డి, ఆనంద్, తిప్పేనాయక్, మల్లికార్జునలు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమం అనంతరం అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రతివారం సమీక్షిస్తున్నారని, అప్రమత్తంగా ఉంటూ ప్రతి అర్జీని పరిష్కరించాలని ఆదేశించారు.

వినతుల్లో కొన్ని...

- సమాచార హక్కు చట్టం ద్వారా తాను కోరిన సమాచారాన్ని దేవదాయశాఖ అధికారులు ఇవ్వడం లేదని పుట్లూరు మండలం చింతకుంట గ్రామానికి చెందిన సూర్యప్రకాశ్ మూర్తి విన్నవించాడు. కార్యాలయానికి ఎందుకు వచ్చావంటూ అధికారులు అసభ్యంగా మాట్లాడుతున్నారని వాపోయాడు.
- నార్పల గ్రామ పొలంలోని తమ 5.15 ఎకరాలను ఆక్రమించారని నార్పల మండలం బొందలవాడ గ్రామానికి చెందిన సుదర్శన్ చెప్పాడు. న్యాయం చేయాలని కోరాడు.
- సర్వే నంబరు 709లో తమకు 7.18 ఎకరాలు భూమి మాత్రమే ఉండాలని, అయితే అంతకంటే ఎక్కువగా ఉందని చెబుతూ ఆ భూమిని రికార్డుల నుంచి తీసివేయాలని పెద్దపప్పూరు మండలం రెడ్డిపల్లికి చెందిన బి.రత్నమ్మ విన్నవించింది.
- కల్లూరు తొమ్మిదో వార్డులోని అంగన్‌వాడీ సెంటర్ వద్ద మురికినీరు నిలిచి దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని మహమ్మద్ రఫీ అనే వ్యక్తి తెలిపాడు. కాలువ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

యాప్‌సోపాలు



- సక్రమంగా పనిచేయని అగ్రీస్టాక్ యాప్
- 72 వేల దగ్గర ఆగిపోయిన రైతు రిజిస్ట్రేషన్లు
- దిక్కులు చూస్తున్న సిబ్బంది

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయ శాఖ చేపట్టిన రైతు రిజిస్ట్రేషన్ల ప్రక్రియను సాంకేతిక సమస్యలు చుట్టుముట్టాయి. వారం రోజులుగా అగ్రీస్టాక్ యాప్ సక్రమంగా పనిచేయడం లేదు. 72 వేల రిజిస్ట్రేషన్ల దగ్గర ఆగిపోయింది. త్వరితగతిన ప్రక్రియను పూర్తి చేయాలంటూ ఉన్నతాధికారులు ఒత్తిడి చేస్తుండటంతో కిందిస్థాయి సిబ్బంది 'యాప్'సోపాలు పడుతున్నారు. అత్యధికంగా పెద్దవడుగూరు మండలంలో 7,663 మంది రైతుల రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. ఆ తర్వాత గుంతకల్లులో 6,997, గుత్తిలో 6,614, తాడిపత్రిలో 5,972, కణేకల్లులో 5,761, విడపనకల్లులో 5,714, రాయదుర్గంలో 5,047 రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఈ మండలాల్లో పరిస్థితి బాగానే ఉన్నా... మిగతా మండలాల్లో సాంకేతిక సమస్య అధికం కావడంతో ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. కుందుర్పి మండలంలో అత్యల్పంగా కేవలం 359 మందివి పూర్తయ్యాయి. శెట్టూరు మండలంలో 382, వజ్రకరూరు–400, కళ్యాణదుర్గం–424, బెళుగుప్ప– 440, కంబదూరు–503, ఆత్మకూరు–510, బ్రహ్మసముద్రం– 537, శింగనమల–540, ఉరవకొండ–558, అనంతపురం–594... ఇలా రిజిస్ట్రేషన్ల కార్యక్రమం మందగించిపోయింది.

పరిష్కారం దొరక్క దిక్కులు..

సమస్యలకు పరిష్కారం చూపాల్సిన ఎన్ఐసీ అధికారులు మిన్నకుండిపోతున్నారు. ఈ క్రమంలోనే రిజిస్ట్రీ ద్వారా యూనిక్ నంబర్ల కేటాయింపు వేగవంతం చేయాలంటూ వ్యవసాయశాఖ అధికారులు ఒత్తిడి చేస్తుండటంతో ఆర్ఎస్‌కే అసిస్టెంట్లు, ఏఈఓలు, ఏఓలు దిక్కులు చూస్తున్న పరిస్థితి నెలకొంది. రైతు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, వాటికి అనుసంధానం అయిన మొబైల్ నంబరు ద్వారా రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత రైతుకు 11 నంబర్లతో కూడిన ఐడీ నంబరు కేటాయిస్తున్నారు. ఇందుకు మూడు సార్లు ఓటీపీ సక్సెస్ కావాలి. చాలా వరకు రెండు ఓటీపీలు సక్సెస్ అవుతున్నా, మూడోది కాక ప్రక్రియ నిలిచిపోతున్నట్లు ఆర్ఎస్‌కే అసిస్టెంట్లు చెబుతున్నారు.

ఇబ్బంది పడుతున్న రైతులు..

విశిష్ట సంఖ్య లేకుంటే ఇన్‌పుట్ సబ్సిడీ, క్రాప్ ఇన్సూరెన్స్, పావలావడ్డీ, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, యాంత్రీకరణ, రాయితీ విత్తనాలు, పంట ఉత్పత్తుల అమ్మకాలు తదితర ప్రభుత్వ ఫలాలు వర్తించే పరిస్థితి ఉండదని మెలిక పెట్టడంతో రైతులకు ఇబ్బందిగా మారింది. కూటమి ప్రభుత్వం కొర్రీలు వేయడానికి రైతులను భయభ్రాంతులకు గురి చేస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారంలోకి వచ్చిన 9 నెలల కాలంలో రైతులకు నయా పైసా విదిలించకుండా మోసం చేసిన సీఎం చంద్రబాబు.. వచ్చే సంవత్సరంలో సాధ్యమైనంత ఎక్కువ మంది రైతులకు లబ్ధి చేకూరకుండా రిజిస్ట్రేషన్ల కార్యక్రమానికి తెరతీశారనే ఆరోపణలున్నాయి.

చిన్న తప్పు దొర్లినా మీదే బాధ్యత

- సీఓలు, డీఓలకు డీఈఓ ప్రసాద్ బాబు హెచ్చరిక
- పదో తరగతి పరీక్షల నిర్వహణపై సమీక్ష



మాట్లాడుతున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణలో ఏ చిన్న తప్పు దొర్లినా చీఫ్ సూపరింటెండెంట్లు(సీఎ), డిపార్ట్‌మెంటల్ అధికారులే(డీఓ) బాధ్యత వహించాల్సి ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) ఎం.ప్రసాద్‌బాబు స్పష్టం చేశారు. ఈనెల 17 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించి సోమవారం డీఓ, సీఎస్‌లతో స్థానిక ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఈఓ, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్, అనంతపురం డెప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు మాట్లాడారు. పరీక్షలు రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఉంటాయన్నారు. మొత్తం 135 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇందులో 98 'ఏ' సెంటర్లు, 37 'బీ' సెంటర్లు ఉన్నాయన్నారు. 32,803 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. నిర్దేశిత సమయంలో మాత్రమే ప్రశ్నపత్రాలు ఓపెన్ చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రశ్నపత్రాలు లీక్ కాకుండా చూడాలన్నారు. పరీక్ష సమయంలో బయట వ్యక్తులెవరినీ పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించొద్దన్నారు. ప్రతి కేంద్రంలో గాలి, వెలుతురు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం ఉండేలా చూసుకోవాలన్నారు. అంధులు, ప్రత్యేక అవసరాల విద్యార్థులకు స్క్రైబ్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అంధ విద్యార్థులకు జంబ్లింగ్ విధానం పాటించాల్సిన అవసరం లేదన్నారు. ఎస్కార్ట్ సాయంతో ప్రశ్నపత్రాలు స్టోరేజీ పాయింట్ నుంచి పరీక్ష కేంద్రాలకు తరలించాలన్నారు. ప్రశ్నపత్రాలను ఇన్విజిలేటర్‌కు అందించే ముందు ఆరోజు జరిగే పరీక్షకు చెందినదా, అదే కోడ్‌కు చెందిన వాటిని అందిస్తున్నామా.. లేదా పరిశీలించుకోవాలన్నారు. పరీక్షల విధుల్లో ఉండే ఉద్యోగులందరూ సమన్వయంతో పని చేసి ఎలాంటి సమస్య ఉత్పన్నంగా కాకుండా ప్రశాంతంగా జరిగేలా చూడాలని కోరారు.

వేలిముద్రలు తీసుకున్నాడు.. డబ్బివ్వకుండా వెళ్లిపోయాడు!

- సచివాలయ ఉద్యోగి నిర్వాకం

తాడిపత్రి రూరల్: పింఛన్‌దారుల నుంచి వేలిముద్రలు తీసుకున్న ఓ సచివాలయ ఉద్యోగి.. డబ్బు పంచకుండా వెళ్లిపోయాడు. ఈ ఘటన తాడిపత్రి మునిసిపాలిటీలోని నందలపాడు సచివాలయం–1 పరిధిలో జరిగింది. వివరాలు.. నందలపాడు సచివాలయం–1 ఉద్యోగి (ఎడ్యుకేషన్ అసిస్టెంట్) సుధాకర్ ఈనెల 1న పింఛన్ల పంపిణీ చేపట్టాడు. దాదాపు 24 మంది లబ్ధిదారుల నుంచి వేలి ముద్రలు తీసుకొన్నాడు. కానీ వారితో వేలిముద్రలు పడలేదని, తరువాత వస్తానని చెప్పి వెళ్లిపోయాడు. అనంతరం కర్ణాటకలోని బళ్లారికి చేరుకున్నాడు. ఈ విషయంపై తోటి ఉద్యోగులకు కూడా సమాచారం ఇవ్వలేదు. తన వద్ద ఉన్న పింఛన్ డబ్బు, వేలిముద్రల మిషన్ అప్పగించలేదు. రెండు రోజులైనా సుధాకర్ రాకపోవడంతో ఆందోళనకు గురైన పింఛన్‌దారులు సోమవారం స్థానిక కౌన్సిలర్ విజయ్‌కుమార్ ఇంటికి వెళ్లి విషయం వివరించారు. ఈ క్రమంలోనే అతను సుధాకర్‌కు ఫోన్ చేసి సాయంత్రంలోపు డబ్బు పంపిణీ చేయకుంటే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని హెచ్చరించగా.. సదరు సచివాలయ ఉద్యోగి హుటాహుటిన వచ్చి డబ్బు పంపిణీ చేయడం గమనార్హం. దీనిపై కమిషనర్ శివరామకృష్ణ మాట్లాడుతూ విషయం తన దృష్టికి రాలేదన్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి, వాస్తవమని తేలితే శాఖా పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

హెంజేరు.. భక్తజన హోరు



సిద్ధేశ్వరస్వామి రథోత్సవంలో పాల్గొన్న అశేషభక్త జనం (ఇన్‌సెట్) వెండి అలంకరణలో సిద్ధేశ్వరస్వామి

- వైభవంగా సిద్ధేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం

'ఓం నమఃశివాయ' అన్న పంచాక్షరీ మంత్రం ప్రతిధ్వనించింది. ఓంకార నాదం మార్మోగింది. 'సిద్ధేశ్వరస్వామికి జై' అంటూ భక్తకోటి చేసిన నినాదం హోరెత్తింది. శివనామస్మరణ మధ్య హేమావతి గ్రామంలో వెలిసిన హెంజేరు సిద్ధేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవం సోమవారం రమణీయంగా సాగింది. ఉత్సవాల్లో భాగంగా అర్చకులు ఉదయం సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలతో తీసుకువచ్చి రథంపై కొలువుదీర్చారు. ఓంకారనాదం చేస్తూ రథాన్ని ముందుకులాగారు. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన జనం రథం పైకి అరటిపండ్లు, బెల్లం, పూలు, మిరియాలు విసిరి మొక్కులు చెల్లించుకున్నారు. కర్ణాటక నుంచి వచ్చిన గురువులు చేసిన 'వీరగాసే' నృత్యం ఆకట్టుకుంది.

– హేమావతి (అమరాపురం):

క్లుప్తంగా

'పోలీసు స్పందన'కు 72 వినతులు



అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 72 వినతులు అందాయి. ఎస్పీ పి.జగదీష్ స్వయంగా వినతులు స్వీకరించి, సమస్య తీవ్రతను అడిగి తెలుసుకున్నారు. చట్టపరిధిలోని సమస్యలకు పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డీవీ రమణమూర్తి, మహిళా పీఎస్ డీఎస్పీ ఎస్.మహబూబ్ బాషా పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి కల్పన

అనంతపురం అగ్రికల్చర్: కంప్యూటర్ పరిజ్ఞానంపై నిరుద్యోగ యువతీయువకులకు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో 60 రోజుల ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఈ మేరకు ఆ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 20 నుంచి 35 సంవత్సరాల వయస్సున్న ఇంటర్, డిప్లొమా పాస్, డిగ్రీ, ఇంజనీరింగ్ ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీసు, లైఫ్ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్, బేసిక్ స్పోకెన్ ఇంగ్లిషు, కస్టమర్ రిలేషన్‌షిప్ స్కిల్స్ తదితర అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 73969 50845లో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులను చితకబాదిన హెచ్‌ఎం

- ఇంటి వద్ద తల్లిదండ్రుల ఆందోళన



కరస్పాండెంట్ ఇంటివద్ద ఆందోళన దృశ్యం

కణేకల్లు: స్థానిక లిటిల్ ఏంజిల్స్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసులు సతీమణి, ఆ పాఠశాల హెచ్‌ఎం భారతి అకారణంగా విద్యార్థులను చితకబాదారు. వివరాలు... సోమవారం మధ్యాహ్నం లంచ్ బ్రేక్ సమయంలో పలువురు విద్యార్థులు క్లాస్ టీచర్ బాబు అనుమతితో బయటికెళ్లి తిరిగొచ్చారు. ఎవరి అనుమతితో వెళ్లారంటూ 8వ తరగతి విద్యార్థి వినయ్‌కుమార్, ధనుష్, దిలీప్, షాహిల్‌ను హెచ్‌ఎం భారతి నిలదీశారు. ఆ సమయంలో వారిచ్చిన సమాధానంతో మరింత ఆగ్రహానికి లోనై చేతికి అందుబాటులో ఉన్న స్టీల్ పైప్ తీసుకుని చితకబాదారు. స్టడీ అవర్స్ తర్వాత ఇంటికెళ్లిన విద్యార్థులు జరిగిన ఘటనను తెలపడంతో సోమవారం రాత్రి స్కూల్ కరస్పాండెంట్ ఇంటి వద్ద బాధిత కుటుంబసభ్యులు ఆందోళన చేపట్టారు. అకారణంగా విద్యార్థులను చితకబాదిన స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు.

అధికారం మాదే... అడిగేవారెవరు?



- 20 ఏళ్లుగా ఖాళీగా ఉన్న స్థలంపై టీడీపీ నేతల కన్ను
- ఆక్రమణదారులకు ఊతమిస్తున్న కనగానపల్లి మండల పచ్చనేత
- ఆక్రమించి బండలు నాటుతున్న వైనం
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, పంచాయతీ అధికారులు
- వంకను కుదించి దాదాపు రెండెకరాల స్థలం చదును



ఇందిరమ్మ కాలనీలో గుడికి కేటాయించిన స్థలంలో నాటిన బండలు



తడకలేరు వంకను ఆక్రమించి చదును చేసి బండలు నాటిన దృశ్యం

రాప్తాడు రూరల్: అనంతపురం నగరం చుట్టూ భూములకు విపరీతమైన ధరలు రావడంతో తెలుగుదేశం పార్టీ చోటా నాయకులుగా చెలామణి అవుతున్న కొందరు ప్రభుత్వ భూములపై కన్నేశారు. అధికారం ఉందనే ధైర్యంతో రెచ్చిపోతున్నారు. పైసా పెట్టుబడి లేకుండా అప్పనంగా రూ. లక్షలు సంపాదించాలంటే ప్రభుత్వ భూములు కబ్జా చేయడమే మార్గంగా ఎంచుకున్నారు. ఇందులో భాగంగానే 20 ఏళ్ల కిందట ఓపెన్ స్థలాలుగా వదిలిన వాటిని దర్జాగా ఆక్రమించేస్తున్నారు. అనంతపురం రూరల్ మండలం కురుగుంట సమీపంలోని మటన్ మార్కెట్ కాలనీ (ఇందిరమ్మకాలనీ)లో ఆక్రమణే ఇందుకు ఉదాహరణ.

నాలుగు రోజుల క్రితం రంగంలోకి తమ్ముళ్లు

కురుగుంట పొలం సర్వే నంబర్ 83–11, 12లో దాదాపు 20 ఏళ్ల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ అర్బన్ హౌసింగ్ స్కీమ్ కింద 178 ప్లాట్లు మంజూరు చేసింది. ఇందులో గుడి, పార్క్ కోసం వేర్వేరు ప్రాంతాల్లో స్థలాలను వదిలిపెట్టారు. అప్పటి నుంచి ఈ స్థలాలు ఖాళీగానే ఉన్నాయి. ఇక్కడ సెంటు ధర రూ.3 లక్షలకు పైగా పలుకుతోంది. గుడి కోసం వదిలిన దాదాపు 22 సెంట్ల స్థలంపై కన్నేసిన టీడీపీ చోటా నాయకులు వెంటనే రంగంలోకి దిగి బండలు నాటించేస్తున్నారు. సెంటున్నర ప్రకారం 15 ఇళ్ల నిర్మాణాలకు స్కెచ్ వేశారు. బరితెగించి కబ్జా చేస్తుండడం వెనుక కనగానపల్లి మండలానికి చెందిన ఓ టీడీపీ నాయకుడి హస్తమున్నట్లు విశ్వసనీయ సమాచారం. తన వాటాగా లక్షలాది రూపాయలను ఆయన ముందుగానే తీసుకుని అభయం ఇవ్వడంతో చోటా నాయకులు మరింత రెచ్చిపోయారు.

వంకను కుదించి.. చదును చేసి..

కురుగుంట పొలం సర్వే నంబర్ 83–11, 12కు సమీపంలోనే సర్వే నంబరు 89లో రెవెన్యూ రికార్డులలోని డైక్లాట్ ప్రకారం తడకలేరు వంక స్థలంగా గుర్తింపు ఉంది. ప్రస్తుతం ఈ వంక స్థలాన్ని సైతం కబ్జా చేసి పేదలకు అమ్మకానికి పెట్టారు. వర్షాకాలం వస్తే ఈ వంక ఉధృతంగా ప్రవహిస్తూ ఉంటుంది. ఉపరితల ప్రాంతాల నుంచి వచ్చే వరద ప్రవాహాన్ని తట్టుకోలేక సమీప కాలనీలన్నీ మునిగిపోయిన సందర్భాలూ చాలా ఉన్నాయి. ఇలాంటి వంకను సైతం ఆక్రమించి ఆనకట్టలా మట్టితో నిర్మించి దాని పక్కనే ఇళ్ల స్థలాల కోసం బండలు నాటుతున్నారు. 'డబ్బు కొట్టు–స్థలం పట్టు' అన్న చందంగా పేదల నుంచి డబ్బు వసూళ్లు చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోతే భవిష్యత్తులో పండమేరు వాగులో కాలనీలకు కాలనీలు మునిగిపోయిన ఘటన ఇక్కడ కూడా పునరావృతం అయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇది పూర్తిగా వంక ప్రాంతం

సర్వే నంబరు 89 అనేది పూర్తి వంక ప్రాంతం. ఈ ప్రాంతాన్ని చదును చేసి బండలు నాటుతున్నట్లుగా తెలియడంతో అక్కడికెళ్లి పనులు అడ్డుకున్నాం. ఎవరైనా మొండిగా బండలు నాటించాలని చూస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికీ తీసుకెళ్లాను.

– రామకృష్ణ, వీఆర్వో

అది ప్రజాప్రయోజనాల స్థలం

మటన్ మార్కెట్ సమీపంలో ఇందిరమ్మ అర్బన్ హౌసింగ్ స్కీమ్ కింద ఏర్పాటైన కాలనీలో ప్రజాప్రయోజనాల కోసం కొంత స్థలాన్ని వదిలారు. గుడి కోసం వదిలిన స్థలంలో కొందరు బండలు నాటుతున్న సమాచారం నా దృష్టికి వచ్చింది. వెళ్లి వారితో మాట్లాడా. పనులు నిలబెట్టాలని చెప్పాం. తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి సర్వే చేయించి ప్రభుత్వ స్థలమంతా హద్దులు నాటి బోర్డులు ఏర్పాటు చేస్తాం.

– చరణ్, పంచాయతీ కార్యదర్శి, కురుగుంట

ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం

అనంతపురం అర్బన్: ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించే దిశగా చిత్తశుద్ధితో అన్ని స్థాయిల అధికారులు పనిచేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. ప్రకృతి వ్యవసాయంలో ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికపై సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జిల్లా స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఉరవకొండ మండలంలో మూడు గ్రామాలు, గుత్తి మండలంలో మూడు గ్రామాల్లో సమీకృత ఫార్మింగ్ క్లస్టర్లను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం డీపీఎం లక్ష్మానాయక్, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, ఉద్యాన శాఖ డీడీ నరసింహారావు, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, ఏపీఎంలు, ఏరియా కో–ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ఇబ్బంది పడతారు జాగ్రత్త

'కొందరు జిల్లా అధికారుల పనితీరు సరిగా లేదని తెలిసింది. మార్పు రాకపోతే ఇబ్బంది పడతారు జాగ్రత్త' అంటూ కలెక్టర్ వి.వినోద్ కుమార్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో అధికారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. జిల్లాధికారులు వారి కార్యాలయాల్లో సమయానికి అందుబాటులో ఉండాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి అధికారులూ సమయపాలన పాటించాలని చెప్పారు. వసతిగృహాల అభివృద్ధికి మినరల్ ఫండ్స్ నుంచి నిధులు ఇస్తామని, మరమ్మతు పనులు ప్రారంభించాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు వసతి గృహాలను దత్తత తీసుకుని పిల్లలు ఏం చేస్తున్నారు.. ఎలా చదువుతున్నారు.. మౌలిక వసతులు బాగున్నాయా.. తదితర అంశాలను పరిశీలిస్తూ ఉండాలన్నారు. ఈ సమావేశంలో జేసీ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్‌ఓ ఎ.మలోల, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తనీయొద్దు

'ఈ ఏడాది వేసవి తీవ్రత అధికంగా ఉండే పరిస్థితి కనిపిస్తోంది. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని పనిచేయాలి' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం తన క్యాంపు కార్యాలయం నుంచి ఆర్‌డబ్ల్యూఎస్, ప్రజారోగ్య శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బోర్‌వెల్స్ మరమ్మతుతో పాటు ఇతర పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీటి రవాణా చేపట్టాలన్నారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఉంటే ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు 7569049872 నెంబర్‌కు ఫోన్ చేసి గ్రామం, వివరాలు, సమస్యను తెలిజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మురళీధర్‌రావు, ప్రజారోగ్యశాఖ ఎస్‌ఈ ఆదినారాయణ, మునిసిపల్ కమిషనర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈలు, జేఈఈలు పాల్గొన్నారు.

బాల్య వివాహాల్లేని జిల్లాగా మారుద్దాం

బాల్యవివాహాలు లేని జిల్లాగా అనంతను మారుద్దామంటూ సంబంధిత అధికారులకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'బాల్య వివాహం... చట్టరీత్యా నేరం' పోస్టర్లను అధికారులతో కలసి ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. బాల్యవివాహాల అడ్డుకట్టకు ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు చట్టాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. అలాగే పశువ్యాధి నియంత్రణ పథకం పోస్టర్లను కలెక్టర్, అధికారులు ఆవిష్కరించి, పశువ్యాధి నియంత్రణ లక్ష్యంగా పనిచేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్‌ఓ ఎ.మలోల పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలతో ఉపాధి పథకం నిర్వీర్యం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



ఉపాధి పనులు పరిశీలిస్తున్న రాంభూపాల్

గార్లదిన్నె: కూటమి ప్రభుత్వ విధానాలతో జిల్లాలో ఉపాధి హామీ పథకం నిర్వీర్యమవుతోందని, వ్యవసాయ కూలీల ఆకలి తీర్చాల్సిన ఉపాధి పనులు ప్రస్తుత రోజుల్లో వారి కడుపు కొడుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ మండిపడ్డారు. గార్లదిన్నె మండలం కోటంకలో చేపట్టిన ఉపాధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గత ఐదు వారాలుగా పనుల్లో పాలు పంచుకున్న కూలీలకు ఒక్క రూపాయి వేతనం కూడా చెల్లించకపోవడం బాధాకరమన్నారు. అలాగే భూమి గట్టిగా ఉండడంతో రోజుకు రూ.100 కూలి కూడా గిట్టుబాటు కావడం లేదన్నారు. ఇద్దరు మనుషులు రోజుకు రెండు క్యూబిక్ మీటర్ల పని చేస్తే పూర్తి కూలి చెల్లిస్తామంటూ అధికారులు చెబుతుండడం భావ్యం కాదన్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఉపాధి హామీ పథకం నిర్వీర్యమవుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు నాగార్జునరెడ్డి, రామసుబ్బారెడ్డి, వలి, రవితేజారెడ్డి, ఆదెప్ప పాల్గొన్నారు.

ఉరవకొండ ప్రభుత్వాస్పత్రి అప్‌గ్రేడ్‌కు చర్యలు

- డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ రమేష్ కిషోర్

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వాస్పత్రిని 50 పడకల నుంచి వంద పడకలకు అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ రమేష్ కిషోర్ తెలిపారు. డీసీహెచ్‌ఎస్ పాల్‌రవికుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్‌వీఎస్ చౌదరితో కలసి సోమవారం ఆస్పత్రిలోని అన్ని విభాగాలను ఆయన పరిశీలించారు. పరిశీలనలో బృంద సభ్యులు స్వప్న, సింధూ, సందీప్, పురుషోత్తం, ప్రసన్న తదితరులు ఉన్నారు.

ఎరువుల విక్రయాల నిలుపుదల

శింగనమల: ప్రభుత్వ అనుమతులు రసాయనిక మందులు, బయో ఫర్టిలైజర్, ఎరువులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఎరువుల దుకాణాల నిర్వాహకులను గుత్తి ఏడీఏ వెంకట్రాముడు హెచ్చరించారు. శింగనమల మండలం తరిమెల, కల్లుమడి గ్రామాల్లోని భైరవ ఫర్టిలైజర్, నిత్యశ్రీ ఆగ్రో ఏజెన్సీ ఎరువుల దుకాణాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనుమతులు లేకుండా అమ్మకం సాగిస్తున్న రూ.3,65,309 విలువైన బయో ఫర్టిలైజర్స్ ఎరువులను గుర్తించి, వాటి విక్రయాలను నిలపుదల చేస్తూ నోటీసులు జారీ చేశారు.అనంతరం రైతు సేవా కేంద్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అన్వేష్‌కుమార్, రైతు సేవా కేంద్రాల సిబ్బంది నవీన్, ఆదినారాయణ పాల్గొన్నారు.

'కూటమి' చర్యలతో ప్రాథమిక విద్య కనుమరుగు

- వైఎస్సార్‌టీఏ నాయకుల ఆందోళన

అనంతపురం ఎడ్యుకేషన్: పాఠశాలల పునర్వ్యవస్థీకరణ (స్కూల్స్ రీఆర్గనైజేషన్) పేరుతో కూటమి ప్రభుత్వం చేపట్టిన చర్యల కారణంగా ప్రాథమిక విద్య కనుమరుగయ్యే ప్రమాదం నెలకొందని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ (వైఎస్సార్‌టీఏ) నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం అనంతపురంలోని ఉపాధ్యాయ భవనంలో వైఎస్సార్‌టీఏ జిల్లా నాయకుల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఉపాధ్యాయ, విద్యారంగం ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటు పేరుతో ప్రైమరీ స్కూల్స్ మూతకు రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా పావులు కదుపుతోందని మండిపడ్డారు. ప్రభుత్వ చర్యలతో ప్రాథమిక విద్య కుంటుపడే ప్రమాదం ఉందని వాపోయారు. అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు సంబంధించి ఆర్థికపరమైన సమస్యలపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. వెంటనే 12వ పీఆర్సీ కమిటీని వేసి, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, ఉపాధ్యాయులకు దక్కాల్సిన పీఎఫ్ లోన్లు. ఏపీజీఎల్ఐ లోన్లు, క్లెయిమ్స్ వెంటనే పరిష్కరించి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌టీఏ అనంతపురం జిల్లా అధ్యక్షుడు ఎస్.నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ గౌడ్, నాయకులు రామకృష్ణ, రాష్ట్ర నాయకులు వెంకటరమణప్ప, గోపాల్, రవీంద్రారెడ్డి, ప్రసాద్, కృష్ణానాయక్ పాల్గొన్నారు.

నీటికుంటలో బాలుడి గల్లంతు



గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని నారాయణపురం గ్రామంలో ఈతకు వెళ్లిన ఓ బాలుడు నీటి కుంటలో గల్లంతయ్యాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు... నారాయణపురం గ్రామానికి చెందిన దుర్గేష్, ప్రీతి దంపతులకు ఇద్దరు కుమారులు కాగా, పెద్ద కుమారుడు దర్శి అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు రోజు కావడంతో స్నేహితులతో కలసి గ్రామ సమీపంలోని నీటి కుంటలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. లోతైన ప్రాంతానికి వెళ్లడంతో నీట మునిగాడు. ఘటనతో భయపడిన స్నేహితులు అక్కడి నుంచి పారిపోయారు. సాయంత్రమైన దర్శి ఇంటికి రాకపోవడంతో సోమవారం ఉదయం బాలుడి స్నేహితులను కుటుంబసభ్యులు ఆరా తీశారు. దీంతో దర్శి గల్లంతైన విషయం వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేష్ వెంటనే స్పందించి అగ్నిమాపక సిబ్బంది సాయంతో కుంటలో గాలింపు చేపట్టారు. చీకటి పడుతున్నా బాలుడి ఆచూకీ లభ్యం కాలేదు. మంగళవారం ఉదయం తిరిగి గాలింపు చేపట్టనున్నట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు.

వృద్ధురాలి బలవన్మరణం



నాగళ్ల శివమ్మ (ఫైల్)

రాయదుర్గం టౌన్: జీవితంపై విరక్తితో ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. సోమవారం ఉదయం రాయదుర్గం పట్టణంలో ఈ ఘటన చోటు చేసుకుంది. బళ్లారి రోడ్డులోని పార్వతీనగర్ మదరసా వెనుక వైపు నడకదారిలో పూర్తిగా కాలిన ఓ మహిళ మృతదేహాన్ని సోమవారం తెల్లవారుజామున స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న డీఎస్పీ రవికుమార్, సీఐ జయానాయక్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతురాలిని పార్వతీనగర్‌కు చెందిన నాగళ్లి శివమ్మ (62)గా గుర్తించారు. ఆమెకు నలుగురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. పార్వతీనగర్‌లోని చిన్న కుమారుడి ఇంట్లో ఉంటున్న శివమ్మ... చాలా కాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. కుటుంబసభ్యులు చికిత్స చేయించినా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె సోమవారం వేకువజామున ఇంట్లో ఉన్న టిన్నర్ బాటిల్ తీసుకెళ్లి మదరసా వెనుక ఖాళీ స్థలంలో శరీరంపై పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

బొమ్మనహాళ్: మండలంలోని గిరిజన తండాకు చెందిన మైనర్ బాలికపై అత్యాచారం చేసిన ఘటనలో నమోదైన పోక్సో కేసులో నిందితుడు తిప్పేస్వామి నాయక్‌ను సోమవారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శివ తెలిపారు. కాగా, నిందితుడు రాయదుర్గం మండలం రాతిబావివంక తండా గ్రామానికి చెందినవాడు. పెళ్లి పేరుతో బాలికను లోబర్చుకుని అత్యాచారం చేసినట్లుగా బాధితురాలు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

హెచ్చెల్సీ బ్రిడ్జికి రంధ్రం

కణేకల్లు: మండలంలోని మాల్యం శివారులో కణేకల్లు–ఉరవకొండ రహదారిలో ఉన్న హెచ్చెల్సీ బ్రిడ్జికి సోమవారం రంధ్రం పడింది. బ్రిడ్జి దిగువన పిల్లర్‌కు ఏర్పాటు చేసిన రాళ్లు సైతం ఊడిపోయాయి. విషయం తెలుసుకున్న ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఈ బ్రిడ్జి కూలిపోతే కణేకల్లు–ఉరవకొండకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. అనంతపురానికి వెళ్లడానికి సైతం ఈ మార్గం అత్యంత ప్రధానమైది. కాగా బ్రిడ్జికి రంధ్రం పడటంతో స్థానికులు రాళ్లు, మట్టి వేసి పూడ్చేశారు. అధికారులు స్పందించి బ్రిడ్జిపై భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని ప్రజలు డిమాండ్ చేశారు.

ప్రాణాలు బలిగొన్న మద్యం



మృతుడు మస్తాన్

గుంతకల్లు టౌన్: అతిగా మద్యం సేవించి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పాత గుంతకల్లులోని వడ్డే వీధికి చెందిన వడ్డే మస్తాన్ (59) దివ్యాంగుడు. పదిహేనేళ్ల క్రితంభార్య సరోజమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి ఒంటరిగా నివసిస్తున్న అతడు మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 1న శనివారం దివ్యాంగుల కోటా కింద పింఛన్ అందుకున్న ఆయన... ఆదివారం తన వాహనంపై కొనకొండ్ల రోడ్డులోని పెట్రోల్ బంక్ వెనుక గల ప్లాట్లల్లో అతిగా మద్యం తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. రెండు రోజుల తర్వాత సోమవారం ఉదయం అటుగా వెళుతున్న వారు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పామిడిలో ఉన్న కుమారుడు వడ్డే ఉమేష్ అక్కడకు చేరుకుని పరిశీలించాడు. అప్పటికే మృతిచెందినట్లుగా నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు వన్‌టౌన్ సీఐ మనోహర్ తెలిపారు.

జనరల్ సర్జరీ పీజీ ఫలితాల్లో సత్తా



రాష్ట్ర టాపర్ డాక్టర్ విష్ణుశ్రీకర్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీ మెడికల్ పరీక్షల ఫలితాల్లో 'అనంత' వాసి డాక్టర్ విష్ణుశ్రీకర్‌రెడ్డి 800 మార్కులకు గాను 613 మార్కులు సాధించి రాష్ట్రంలోనే టాపర్‌గా నిలిచారు. మూడు రోజుల క్రితం ఫలితాలు విడుదలయ్యాయి. డాక్టర్ విష్ణుశ్రీకర్‌రెడ్డి ప్రస్తుతం కర్నూలు మెడికల్ కళాశాలలో పీజీ జనరల్ సర్జరీ చేస్తున్నారు. ఆయన తండ్రి డి.జనార్దన్‌రెడ్డి గతంలో అనంతపురం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేశారు. తల్లి జయశ్రీదేవి గృహిణి. వీరి సొంతూరు కణేకల్లు కాగా ప్రస్తుతం అనంతపురం నగరంలో నివాసం ఉంటున్నారు. ఈ సందర్భంగా విష్ణుశ్రీకర్‌రెడ్డిని డాక్టర్ లక్ష్మణ ప్రసాద్, డాక్టర్ కొండయ్య, డాక్టర్ రఘువంశీ, డాక్టర్ సింధూర, డాక్టర్ శంకర్ గౌడ్, జయరామ రెడ్డి, రాయదుర్గం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ తదితరులు అభినందించారు.

ఉమ్మడి జిల్లాకే తలమానికం గవిమఠం

- తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటకలోనూ 770 మఠాలు
- నేటి నుంచి చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు






బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన గవిమఠం, గవిమఠంలోని గవి సిద్ధేశ్వరుడి మూలవిరాట్, మరకత లింగం

ఉరవకొండ: తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటకలోనూ దాదాపు 770 ఉపమఠాలు కలిగి ఉమ్మడి జిల్లాకే తలమానికంగా ఉరవకొండలోని గవిమఠం నిలుస్తోంది. రూ.కోట్ల విలువైన స్థిరాస్తులతో నిత్య శివనామస్మరణతో విరాజిల్లుతున్న శైవ క్షేత్రమిది. శైవ ధర్మ ప్రచారంలో భాగంగా గవి మఠం మొదటి పీఠాధిపతులు కరిబసవస్వామి దేశ సంచారం చేస్తూ వివిధ ప్రాంతాల్లో 770 ఉపమఠాలు స్థాపించారు. వీటి పరిధిలో రూ.కోట్లు విలువ చేసే మాన్యాలు, భవనాలు ఉన్నాయి. ఉరవకొండలోని దాదాపు 80 శాతం ప్రభుత్వ భవనాలు గవిమఠం విరాళంగా ఇచ్చిన స్థలాల్లోనే నిర్మించడం గమనార్హం. గవిమఠం స్థలాల్లోనే ప్రభుత్వ ఆస్పత్రి, ప్రభుత్వ కార్యాలయాలు, పురాతన ఎస్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, ఎస్‌కేఆర్‌సీ క్లబ్ నడుస్తున్నాయి. కొన్ని వందల కుటుంబాలు మఠం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాలను లీజుకు తీసుకుని వివిధ వ్యాపారాలతో జీవనం సాగిస్తున్నాయి. గవిమఠానికి వచ్చే భక్తులకు నిత్య ఉచిత భోజన వసతి కల్పిస్తుంటారు. ప్రస్తుతం గవి మఠం 8వ పీఠాధిపతులుగా జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామి, ఉత్తరాధికారిగా డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి కొనసాగుతున్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

ఉరవకొండ గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 4న ప్రారంభం కానున్నాయి. మంగళవారం ఉదయం కంకణధారణతో బ్రహ్మోత్సవాలకు అంకుర్పారణ చేయనున్నారు. 5న నాగభరణ ఉత్సవం, 6న నెమలి వాహనోత్సవం, 7న గవిమఠం 8వ పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామి వారి అడ్డపల్లకీ ఉత్సవం, 8న మహా గణారాధన, బసవేశ్వర వాహనోత్సవం, 9న చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం, 10న లంకాదహనం ఉంటాయి. 11న వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

అన్ని ఏర్పాట్లు పూర్తి



వారం రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాం. గవిమఠం పీఠాధిపతుల ఆశీస్సులతో అన్నీ శాఖల అధికారులను సమన్వయం చేసుకుని బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నాం.

– కె.రాణి, సహాయ కమిషనర్/మేనేజర్, గవిమఠం, ఉరవకొండ

క్లుప్తంగా

కంపోస్టు యార్డు తరలించాలి



మేయర్ వసీంకు వినతిపత్రం అందజేస్తున్న రాజీవ్‌కాలనీ వాసులు, సీపీఎం నాయకులు

అనంతపురం కార్పొరేషన్: కంపోస్టు యార్డును తరలించాలని రాజీవ్ కాలనీ సర్పంచ్ ఆశాబీ, సీపీఎం నగర కమిటీ నాయకులు, లెక్చరర్స్ కాలనీ ప్రజలు కోరారు. సోమవారం నగరపాలక సంస్థలో మేయర్ వసీంను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కంపోస్టు యార్డు నుంచి దుర్వాసనతో పాటు వేకువజామున, సాయంత్రం వేళలో పొగ వస్తోందని తెలిపారు. తద్వారా ఇబ్బందులు పడుతున్నామన్నారు. కంపోస్టులో చెత్త నిర్వహణతో పాటు కంపోస్టు యార్డును అక్కడ లేకుండా మరో అనువైన ప్రాంతానికి తరలిస్తే బాగుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామిరెడ్డి, వెంకటనారాయణ, ముర్తుజా, శీన, రాజీవ్ కాలనీ మాజీ సర్పంచ్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా - మహిళ మృతి



మృతురాలు జల్లా భారతి

ముదిగుబ్బ: ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ ప్రయాణికురాలు మృతి చెందింది. ముదిగుబ్బ మండలం సంకేపల్లి క్రాస్ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. సోమవారం ఉదయం ప్రయాణికులతో కదిరికి వెళుతున్న ఆటో సంకేపల్లి క్రాస్ వద్దకు చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న గుర్తు తెలియని మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, మరికొందరు స్వల్పంగా గాయపడ్డారు. కాగా, మృతురాలు కదిరిలో ఉన్న తన కుమార్తెను చూసేందుకు వచ్చినట్టుగా తమతో చెప్పినట్లు పోలీసులకు తోటి ప్రయాణికులు తెలిపారు. తొలుత గుర్తు తెలియని మహిళ మృతిగా ముదిగుబ్బ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలోనే గంటల వ్యవధిలోనే మృతురాలిని అనంతపురానికి చెందిన జల్లా భారతి(45)గా గుర్తించారు. కదిరిలో ఉన్న తన కుమార్తె జల్లా ఉదయలక్ష్మిని చూసేందుకు వచ్చిన ఆమె తిరిగి అనంతపురానికి వెళ్తుండగా ప్రమాదంలో మృతి చెందినట్లుగా పోలీసులు నిర్ధారించారు.

స్థల సమస్యకు పరిష్కారం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని రాంనగర్‌లో ఓ ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించిన స్థల వివాదానికి కోర్టు ఆదేశాలతో టౌన్ ప్లానింగ్ అధికారులు పరిష్కారం చూపారు. సోమవారం సదరు స్థలంలో రోడ్డు ఉండటంతో.. ఆ రోడ్డును జేసీబీ ద్వారా తొలగించి, స్థలాన్ని యజమానులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. రాంనగర్ సర్వే నంబర్ 59 ఎంఎల్‌పీ నంబర్ 193/82లో ప్లాట్ నంబర్ 23, 24 స్థల యజమానులు కోర్టును ఆశ్రయించారు. వారి స్థలంలో రోడ్లు, కాలువ వెళ్లినట్లు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కోర్టు ఆదేశాలతో ఏసీపీ శిరీష, టీపీఎస్ దుర్గాంజలి, తదితరులు సమస్యకు పరిష్కారం చూపారు. ఇదిలా ఉన్నా.. నగరంలోని సెంట్రల్ పార్క్, అదే రాంనగర్‌లో టీడీపీకి చెందిన ఓ వ్యక్తి ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపట్టినా ఏసీపీ శిరీష ఏనాడు దానిపై పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడంలోనూ ఏసీపీ శిరీష చొరవ చూపితే బాగుంటుందని ప్రజలు చెబుతున్నారు. కోర్టులు మొట్టికాయలు వేసే వరకు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ సిబ్బంది కదిలేలా కన్పించడం లేదు. రూ.వందల కోట్లు విలువ చేసే సెంట్రల్ పార్క్ సమస్యకు ఎప్పుడు పరిష్కారం చూపుతారో వేచి చూడాలి.

కార్మికుల సమస్యలు పట్టించుకోరా?



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

అనంతపుర అర్బన్: మునిసిపల్ కార్మికుల సమస్యలను కూటమి ప్రభుత్వం విస్మరిస్తోందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రాజారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట మునిసిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా కార్మికుల సమస్యలను పట్టించుకోలేదని మండిపడ్డారు. అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.. దేవాలయాలు తిరుగుతూ బీజేపీ భజన చేస్తున్నారని మండిపడ్డారు. లోకేష్ రెడ్‌బుక్ అమలులో బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. మునిసిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు, ఇక పాఠశాలల్లో పనిచేసే వాచ్‌మెన్, స్వీపర్లకు రూ.15 వేలు కనీస వేతనం ఇవ్వాలన్నారు. ఈనెల 11న అసెంబ్లీ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మునిసిపల్ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి రాజేష్‌గౌడ్, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, మునిసిపల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చిరంజీవి పాల్గొన్నారు.

పర్యవేక్షణ శూన్యం..

డాక్టర్ల ఇష్టారాజ్యం

- జీజీహెచ్ అత్యవసర విభాగాల్లో వైద్యుల డుమ్మా
- కొరవడిన సూపరింటెండెంట్ పర్యవేక్షణ
- సకాలంలో చికిత్స అందించలేని పరిస్థితి
- ఇబ్బందులు పడుతున్న రోగులు



రోగులతో కిక్కిరిసిన వార్డు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో అత్యవసర విభాగాల్లో వైద్య సేవలు అందడం లేదు. వైద్యులు ఇష్టానుసారంగా విధులకు డుమ్మా కొడుతుండటంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు పర్యవేక్షణ లోపం కొందరు వైద్యులకు వరంగా మారుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అత్యవసర విభాగాల్లో రౌండ్ ద క్లాక్ ఉండాల్సిన వైద్యులు పత్తా లేకుండా పోతున్నారు. దీంతో రోగులు, తల్లులు, చంటి బిడ్డలు బిక్కు బిక్కుమంటూ ఎదురుచూడాల్సి వస్తోంది. నాణ్యమైన వైద్యం దేవుడికెరుక కనీసం సకాలంలో చికిత్స అందించలేని పరిస్థితి నెలకొంది. ఆస్పత్రిలోని నవజాత శిశు కేంద్రం (ఎస్ఎన్‌సీయూ), బ్లడ్ బ్యాంకు, ఎమర్జెన్సీ వార్డుల్లో వైద్యులు పత్తా లేకుండా పోతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ క్షేత్రస్థాయిలో పర్యటించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

రక్తనిధిలోనూ అంతే..

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని రక్తనిధి కేంద్రంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే వైద్యులు ఉంటున్నారు. ఇక సాయంత్రం 4 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉండరు. రోగులకు అత్యవసరంగా రక్తం కావాల్సి వస్తే సంబంధిత గైనకాలజిస్టులు తదితరులు చూసుకోవాల్సి వస్తుంది. రోజూ పదుల సంఖ్యలో రోగులకు రక్తం అందిస్తుంటారు. ఏదైనా రోడ్డు ప్రమాదం, గర్భిణులు, బాలింతలకు రక్తం అత్యవసరమైతే వైద్యం ఆలస్యమయ్యే ప్రమాదం లేకపోలేదు. సోమవారం 5:30 గంటల సమయంలో వైద్యులు కనిపించ లేదు.

వామ్మో ఎమర్జెన్సీ వార్డు

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డుకు రోజూ 500 నుంచి 800 మంది వైద్యం కోసం వస్తుంటారు. తీవ్ర అనారోగ్యం తదితర సమస్యలతో ఆస్పత్రికి వచ్చే వారు అధికం. అటువంటిది ఇక్కడ మెడికల్ ఆఫీసర్, పీజీలు మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. వాస్తవంగా సంబంధిత విభాగాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు అందుబాటులో ఉండాలి. సోమవారం మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అరాఫత్ అందుబాటులో ఉన్నారు. కానీ ఇక్కడ ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ మాత్రమే ఉంటున్నారు. రౌండ్ ద క్లాక్ వైద్యులను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటే రోగులకు సత్వర వైద్యం అందుతుంది.



ఎస్ఎన్‌సీయూలో సోమవారం 5:59 గంటల సమయంలో ఖాళీగా ఉన్న వైద్యుడి కుర్చీ

డీఎంఈకి ఫిర్యాదు చేస్తాం..



వైద్యులు అందుబాటులో లేని విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నాం. మూడుసార్లు మెమోలు జారీ చేసి, తర్వాత సంబంధిత వైద్యుల పనితీరుపై డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)కి ఫిర్యాదు చేయబోతున్నాం. వైద్యులు ఎవరు అందుబాటులో లేకున్నా.. ఉపేక్షించేది లేదు. రక్తనిధి కేంద్రంలో సాయంత్రం 4 గంటల తర్వాత సంబంధిత అసిస్టెంట్ ప్రొఫెసర్ చూడాలి. ఎమర్జెన్సీలోనూ వైద్యులు ఉండేలా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, సూపరింటెండెంట్, జీజీహెచ్

తీరుమారని ఎస్ఎన్‌సీయూ



ఎస్ఎన్‌సీయూలో వైద్యుల కోసం పసికందులతో వేచి ఉన్న దృశ్యం

సర్వజనాస్పత్రిలోని ఎస్ఎన్‌సీయూలో 40 పడకల్లో నెలల పసికందులు వైద్యం పొందుతున్నారు. ఇందులో 10 కేసులు ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నాయి. సోమవారం 5:59 గంటల సమయంలో సంబంధిత వైద్యులు అందుబాటులో లేరు. దీంతో పాటుగా లేబర్ వార్డు నుంచి పసికందులను చూపించేందుకు అధిక సంఖ్యలో తల్లులు, వారి సహాయకులు వైద్యుల కోసం వేచి ఉన్నారు. వాస్తవంగా అక్కడున్న స్టాఫ్‌నర్సులే రౌండ్ ద క్లాక్ పసికందులకు సేవలందించాల్సిన దయనీయమైన పరిస్థితి నెలకొంది. వైద్యులు స్టాఫ్‌నర్సులకు అప్పగించేసి వెళ్లిపోతున్నారు.

సర్వేల్లో నిర్లక్ష్యం వహించొద్దు

అనంతపురం కార్పొరేషన్: ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన పీ4, ఎంఎస్ఎంఈ, చిల్డ్రన్ విత్ అవుట్ ఆధార్, మిస్సింగ్ చిల్డ్రన్, వర్క్ ఫ్రమ్ హోం డేటా, తదితర సర్వేలను పకడ్బందీగా చేపట్టాలి. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ బాలస్వామి సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. సోమవారం సాయంత్రం నగరపాలక సంస్థలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సర్వేల ప్రాముఖ్యతను సిబ్బందికి తెలియజేశారు. సర్వే ద్వారా ఎవరూ ఇబ్బందులు పడాల్సిన పనిలేదన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సర్వేతో ఎటువంటి పథకాల జాప్యం ఉండదని పేర్కొన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పారా పవర్‌లిఫ్టింగ్ పోటీలు

అనంతపురం: ఈనెల 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకూ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని నోయిడా అమిటీ వర్సిటీలో జాతీయ స్థాయి పారా పవర్ లిఫ్టింగ్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో ప్రాతినిధ్యం వహించేందుకు సోమవారం నగరంలోని ఇండోర్ స్టేడియంలో క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో కే.చందన (కదిరి), ఆర్.బింజయ్య (శ్రీకాకుళం), పి.బాబా (ధర్మవరం) పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనబరిచిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. కార్యక్రమంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ అనంతపురం జిల్లా అధ్యక్షుడు ఆర్.నాగరాజు, కార్యదర్శి ఎస్.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పన్నారపు బండ్ల ప్రదర్శన



పన్నారపు బండ్లను ఆలయం చుట్టూ తిప్పుతున్న దృశ్యం

ఆత్మకూరు: మండలంలోని సనప మాధవరాజుల స్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన పన్నారపు బండ్ల ప్రదర్శన ఆకట్టుకుంది. తొలుత ఆలయంలోని స్వామిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఎద్దుల బండ్లను రంగు రంగుల కాగితాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఎద్దుల బండ్లను మేళతాళాలతో మాధవరాజుల స్వామి ఆలయం చుట్టూ తిప్పారు. మంగళవారం రథోత్సవం, బుధవారం పరుష నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.

మహిళల రక్షణకు ప్రాధాన్యత

అనంతపురం: మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా అనంతపురం అర్బన్, అనంతపురం రూరల్, కళ్యాణదుర్గం, తాడిపత్రి, గుంతకల్లు ఐదు సబ్ డివిజన్ల పరిధిలో ఆయా పోలీసు అధికారుల ఆధ్వర్యంలో సోమవారం కళాశాలలు, పాఠశాలల్లో వ్యాస రచన పోటీలు నిర్వహించారు. మహిళా, పోక్సో చట్టాలు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సామాజిక మాధ్యమాలు, సైబర్ క్రైమ్స్‌పై పోలీసులు అవగాహన కల్పించారు. పోలీసు శాఖ మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. ఎల్లవేళలా పోలీసు సిబ్బంది సహాయ సహకారాలు ఉంటాయని భరోసా కల్పించారు.

- మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా సోమవారం నగరంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం, గిల్డ్ ఆఫ్ సర్వీసు స్కూల్ విద్యార్థినులతో సమావేశం ఏర్పాటు చేశారు. అంబేడ్కర్ సర్కిల్ వరకూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సమాజంలో బాల్య వివాహాల రద్దు, బాలికలను ఎదగనిద్దాం, చదవనిద్దాం అంటూ నినాదాలు చేశారు. ఆర్డీఓ కేశవ నాయుడు, టూ టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీఎన్ శ్రీదేవి, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్ పంపిణీ

అనంతపురం కార్పొరేషన్ అర్హులందరికీ సకాలంలో పింఛన్లు పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ శివ నారాయణ్ శర్మ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం నగరంలోని జీసస్ నగర్‌లో ఎన్టీఆర్ భరోసా పథకం కింద లబ్ధిదారులకు ఆయన పింఛన్ పంపిణీ చేశారు. ఆర్డీఓ కేశవనాయుడు, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి



కుడితిపూడి రామకృష్ణయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న సాకే శైలజానాథ్

అనంతపురం కార్పొరేషన్: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్ట్‌లను పూర్తి చేసి సాగు, తాగు నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ డిమాండ్ చేశారు. కుడితిపూడి రామకృష్ణయ్య జయంతి సందర్భంగా అనంతపురంలోని నీటి పారుదల శాఖ కార్యాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి సోమవారం మాజీ మంత్రి సాకే శైలజానాథ్ నివాళులర్పించారు. కరువును ప్రత్యక్షంగా చూసిన రామకృష్ణయ్య రాయలసీమలోని చిన్ననీటి పారుదల వ్యవస్థలను, మధ్యతరహా నీటి పారుదల వ్యవస్థలను సూక్ష్మంగా అధ్యయనం చేసి, పరిష్కారం చూపేలా భారీ ప్రాజెక్టులకు రూపకల్పన చేశారన్నారు. ఆయనను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం కమీషన్ల కోసం ఆలోచించకుండా భవిష్యత్తరాలకు ఉపయోగపడేలా ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రాయలసీమ జన సంఘం నాయకులు, రామకృష్ణయ్య స్మారక సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ చట్టంలోని అసంబద్ధాలను తొలగించండి



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు నీలూరి రమణారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న బదిలీల చట్టంలోని అసంబద్ధాలను తొలగించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నీలూరి రమణారెడ్డి, ఎస్. రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కొత్త చట్టంలో ఉపాధ్యాయులందరికీ న్యాయం జరిగేలా చూడాలని కోరారు. స్టేషన్ పాయింట్లు, సర్వీస్ పాయింట్లకు సంబంధించి ఏ ఉపాధ్యాయుడు నష్టపోకుండా అందరికీ ఆమోదయోగంగా ఉండాలన్నారు. స్పెషల్ కేటగిరి, ప్రిఫరెన్షల్ కేటగిరికి సంబంధించి సంఘాలు, ఉపాధ్యాయుల నుండి వచ్చిన వినతులను పరిశీలించి అసంబద్దాలను తొలగించాలన్నారు. నెగిటివ్ పాయింట్లు తొలగించాలన్నారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సూర్యుడు, రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు ఫణి భూషణ్, శివయ్య చారి, కృష్ణమోహన్, బాబ్జి నాయక్, చలపతి, చంద్రశేఖర్ స్వామి, డేనియల్, మల్లికార్జున, రామకృష్ణ, శ్రీనివాసులు, నారాయణస్వామి, హరి ప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ముస్లింలకు ఇఫ్తార్ విందు

అనంతపురం కల్చరల్: రంజాన్ మాసంలో నమాజ్, ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలకు నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. కవి నబీరసూల్ ఆధ్వర్యంలో గాంధీ బజార్‌లోని లాల్‌బండ్ మసీదులో ట్రస్టు అధ్యక్షురాలు డాక్టర్ నిర్మల ఆధ్వర్యంలో 600 మందికి భోజనం ప్యాకెట్లు అందజేశారు.కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఓబులపతి, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఎరా' స్కూల్ విద్యార్థుల ప్రతిభ

అనంతపురం రూరల్: ఇటీవల న్యూఢిల్లీలో నిర్వహించిన సిల్వర్ జోన్ ఒలింపియాడ్ పరీక్షల్లో ఎరా ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పరీక్షలకు 20 మంది విద్యార్థులు హాజరు కాగా.. 7 మంది స్వర్ణ పతకాలు సాధించారు. ముగ్గురికి కాంస్యం, మరో ముగ్గురికి రజత పతకాలు లభించినట్లు ఎరా ఇంటర్నేషనల్ పాఠశాల చైర్మన్ అరుణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో సైతం రాణించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి పాల్గొన్నారు.

స్టేడియాన్ని క్రీడాకారులకు అప్పగించాలి

అనంతపురం: నగరంలో 60 సంవత్సరాల చరిత్ర కలిగిన నీలం సంజీవరెడ్డి స్టేడియాన్ని క్రీడాకారులకు అప్పగించాలని ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మచ్చా రామలింగా రెడ్డి కోరారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, ఎస్పీ చొరవ చూపి సమస్యను వారం రోజుల్లో పరిష్కరించకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. వచ్చే వారం నుంచి పెద్ద ఎత్తున ధర్నాలు, నిరాహార దీక్షలు చేస్తామని పేర్కొన్నారు. గతంలో క్రీడాకారులపై ఈ తరహాలో పోలీసులు వ్యవహరించలేదన్నారు. పోలీసులే దగ్గరుండి జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యాలయాన్ని ధ్వంసం చేసి.. అందులోని ఫర్నిచర్ పడేశారని పేర్కొన్నారు.

హోంగార్డులను బదిలీ చేయాలి

అనంతపురం: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హోంగార్డులు తెలంగాణలో పని చేస్తున్నారు. వారిని ఇక్కడికి బదిలీ చేయాలని ఏఐవైఎఫ్ నాయకులు పేర్కొన్నారు. సోమవారం ఎస్పీ పి.జగదీష్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర విభజన తరువాత తెలంగాణలో ఎక్కువ మంది ఉండిపోవాల్సి వచ్చిందన్నారు. వారంతా అక్కడ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖలో ఉద్యోగులను వారి స్థానికత ప్రకారం మార్చటం జరిగిందన్నారు. హోంగార్డులను మాత్రం మార్చలేదని తెలిపారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ అనంతపురం జిల్లా అధ్యక్షుడు కోట్రేష్, జిల్లా సహాయక కార్యదర్శి ధనుంజయ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'మహిళల కుటుంబాలను ఆదుకోండి'

అనంతపురం అర్బన్: కమ్మూరు సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు అక్కాచెల్లెళ్లు, చిన్నారి మృతి చెందడం బాధాకరమని సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప అన్నారు. వారి కుటుంబాలను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మృతి చెందిన వారికి ప్రభుత్వం రూ.20 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించాలన్నారు. తీవ్రంగా గాయపడిన వారికి మెరుగైన వైద్యం, కుటుంబ పోషణకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ప్రమాదానికి కారకులైన వారిని తప్పించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నట్లు మృతుల బంధువులు ఆరోపిస్తున్నారన్నారు. ఇలాంటి కేసుల్లో ధనవంతుల పిల్లలు ఉండటంతో కేసును తారుమారు చేసిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. అమాయక ప్రజల ప్రాణాలు బలితీసుకున్న వారిని కేసు నుంచి తప్పించేందుకు ఎంతటి వారు ప్రయత్నించినా తలొగ్గకుండా పోలీసులు నిబద్ధతతో ఉంటూ చట్టబద్ధంగా వ్యవహరించాలని సూచించారు.

సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు హేయం



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పనులు చేస్తే పాముకు పాలు పోసినట్లేనని సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు చేయడం దుర్మార్గం. తక్షణం మాటలు వెనక్కి తీసుకుని ప్రజలందరూ సమానమేనన్న ఆలోచనతో ముందుకెళ్లాలని మేయర్ వసీం హితవు పలికారు. సోమవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు అవుతోందన్నారు. ప్రజలకు పారదర్శకంగా పాలన అందించాల్సిన సీఎం చంద్రబాబు బహిరంగంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులపై వివక్ష చూపడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఈ విధంగా విమర్శలు చేస్తే అర్హులకు పథకాలు ఏవిధంగా అందుతాయని ప్రశ్నించారు. భవిష్యత్తులో ప్రజలు కొట్టుకునే పరిస్థితిని సీఎం చంద్రబాబు నాయుడు తీసుకువచ్చేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగ బద్ధంగా ముందుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీలు, కుల, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందేలా చర్యలు తీసుకున్నట్లు గుర్తు చేశారు. అప్పట్లో కూటమి ప్రభుత్వానికి చెందిన కార్యకర్తలు, నాయకులు పథకాలు తీసుకున్న సందర్భాలు ఉన్నాయన్నారు. సీఎం చంద్రబాబు కూటమి ప్రభుత్వానికి ముఖ్యమంత్రి అన్న ధోరణిలో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ఆయన తన మాటలను వెనక్కి తీసుకోవాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, కమల్‌భూషణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు కుళ్లాయస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా 'గాదె' గెలుపుపై హర్షం



విజయ సంకేతం చూపుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు


అనంతపురం ఎడ్యుకేషన్: ప్రతిష్టాత్మకమైన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులు నాయుడు గెలుపుపై జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం స్థానిక ఉపాధ్యాయ భవనంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పీఆర్టీయూ, ఏపీటీఎఫ్ (1938), ఆపస్ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. కూటమి పార్టీలు బలపరిచిన అభ్యర్థికి వ్యతిరేకంగా టీచర్లు తీర్పు ఇచ్చారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మారాలని సూచించారు. గాదె శ్రీనివాసులు నాయుడు గతంలోనూ రెండు సార్లు ఎమ్మెల్సీగా పని చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు ఎన్. విష్ణువర్ధన్ రెడ్డి, టి. చంద్రశేఖర్ రెడ్డి, టి. పురుషోత్తం రెడ్డి, జి.తిమ్మారెడ్డి, కె.బాబయ్య, ఏపీటీఎఫ్ (1938) నాయకులు వెంకట సుబ్బయ్య, శ్రీనివాస రెడ్డి, శ్రీనివాస నాయక్, ఆపస్ ఎర్రిస్వామి, పీఆర్టీయూ నాయకులు శ్రీరాములు, ఎంవీ శివారెడ్డి, ఎల్లప్ప, కేశవ నాయుడు, వైసీ ప్రసాద్ రెడ్డి, ఏ.కేశవ రెడ్డి, బి.తిమ్మారెడ్డి, బి.చిదంబరెడ్డి ,శ్రీనివాసులు, జయప్రకాష్ పాల్గొన్నారు.

జనసంద్రమైన దాదులూరు



ప్రత్యేక అలంకరణలో పోతలయ్య, బంగారు లింగయ్య స్వాములు

- వైభవంగా జ్యోతుల మహోత్సవం
- నేడు గావుల ఉత్సవం



పోతులయ్య స్వామి ఆలయం వద్ద భక్తుల సందడి

కనగానపల్లి: మండలంలోని దాదులూరు వెలసిన పోతలయ్యస్వామి జాతరలో భాగంగా సోమవారం జ్యోతుల మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని పోతలయ్య, చెన్నేకేశవులు, బంగారు లింగమయ్య స్వాములను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు జ్యోతులు, బోనాలు ఎత్తుకొని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం చుట్టు ప్రక్కల గ్రామాల్లోని రైతులు ఎద్దులు, ట్రాక్టర్లతో పన్నేరు బండ్లు కట్టి ఆలయం చుట్టూ తిప్పారు. వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు జనసంద్రమయ్యాయి.

నేడు గావుల ఉత్సవం..

దాదులూరు పోతలయ్యస్వామి జాతరలో ప్రధాన ఘట్టమైన గావుల మహోత్సవాన్ని మంగళవారం తెల్లవారుజామున నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, పూజార్లు తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం ఉదయం జంతు బలులతో భక్తులు మొక్కులు తీర్చుకోనున్నారు.





బారులు తీరిన జనం. ఆలయం చుట్టూ తిప్పుతున్న పన్నారపు బండి